విద్యుత్ కాంతుల్లో హనుమకొండ పద్మాక్షి రోడ్

ఊరూరా నేడే పూల జాతర

- సద్దులకు ఆడబిడ్డలు సిద్ధం.. పెద్ద బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి
- పూలవనాలు కానున్న పల్లెలు.. ఆడిపాడనున్న మహిళలు
- సందడి చేయనున్న పిల్లలు, పెద్దలు.. మార్కెట్లన్నీ కళకళ

జనంతో కోలాహలంగా హనుమకొండ ట్రైలర్‌స్టీట్

ములుగులో పూలు కొనుగోళ్ల సందడి

వరంగల్‌లోని చిన్న వడ్డెపల్లి చెరువు వద్ద పూర్తయిన ఏర్పాట్లు

బతుకమ్మ ఉత్సవాల కోసం ములుగులోని కోపుకుంట మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటుచేసిన సెట్టింగ్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, అక్టోబర్ 21 : మహిళలకు అత్యంత ఇష్టమైన పెద్దబతుకమ్మ సంబురాలు ఆదివారం హోరెత్తనున్నాయి. చిన్నాపెద్దా తేడాలేకుండా ఉత్సాహంగా జరుపుకొనే సద్దులకు ఊరూరా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎంగిలిపూల నుంచే పల్లెపట్టణం తేడా లేకుండా తీరొక్క పూలతో రోజూ చిన్నబతుకమ్మలను పేర్చి అందరొక్కచోట చేరి ఆడిపాడారు. కొత్తగా పెళ్లయి మెట్టినింటికి వెళ్లిన మహిళలంతా బతుకమ్మ పండగకు పుట్టినింటికి చేరుకుంటారు. మమతానురాగాల బతుకమ్మను పేర్చి సంతానం, పాడిపంటా చల్లంగుండాలని ఆడిపాడుతారు. ఏడాదికి సరిపడా ఆనందాన్ని మూటగట్టుకొని తిరిగి మెట్టింటికి వెళతారు. తమకు మంచి భర్త దొరకాలని కన్నె పిల్లలు బతుకమ్మను కొలుస్తారు. ముఖ్యంగా సద్దుల బతుకమ్మ రోజున మహిళల సందడి అంతా ఇంతా కాదు. పూలు సేకరించి, కట్టలు కట్టి, రంగులద్ది, బతుకమ్మను పేర్చి ఆడిపాడి చెరువులు, కాలువలు, నదులో నిమజ్జనం చేస్తారు. ఆ తర్వాత వాయినాలు ఇచ్చిపుచ్చుకొని సత్తుపిండి పంచుకుంటూ బతుకమ్మ పాటలు నెమరేసుకుంటూ ఇళ్లకు చేరుకుంటారు.

ఏర్పాట్లు పూర్తి

సద్దుల బతుకమ్మ కోసం హనుమకొండలోని పద్మాక్షి గుట్ట, మెట్టుగుట్ట, వరంగల్‌లోని రంగలీల మైదానం, చిన్న వడ్డేపల్లి, జనగామలోని బతుకమ్మ కుంట, భూపాలపల్లిలోని అంబేద్కర్ స్టేడియం, హనుమకొండ టింపుల్, ములుగులోని తోపుకుంట మినీ ట్యాంక్ బండ్, మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం, నిజాం చెరువు, బంధం చెరువు వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా చోట్ల వేదికలు అంబరాన్నంటనున్నాయి.

మార్కెట్లు కళకళ

బతుకమ్మ కోసం తీరొక్క పువ్వులు, ఆకులు కొనుగోలు చేసేవారితో మార్కెట్లన్నీ శనివారం కిటకిటలాడాయి. పల్లెల నుంచి పలువురు రైతులు, కూలీలు గునుగు, తంగేడు, పట్టు కుచ్చులు ఇలా రకరకాల పూలను తెచ్చి విక్రయించారు. బతుకమ్మను పేర్చేందుకు శనివారం నుంచే ఆడబిడ్డలు గునుగు కట్టలను సిద్ధం చేసుకున్నారు.

విద్యుత్ వెలుగుల్లో హనుమకొండలోని పద్మాక్షి ఆలయం

హనుమకొండలో గునుగు, బంతి పూల కొనుగోళ్లు

కేసీఆరే సారే పెద్ద దిక్కయిండు..

మహబూబాబాద్, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ) : కష్టకాలంలో సీఎం కేసీఆరే మా కుటుంబానికి పెద్ద దిక్కయ్యిండు. రైతుబీమా ఇచ్చి అన్ని విధాలా ఆదుకున్నడు. మాది మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మునిగలవీడు గ్రామం. మా ఆయన పేరు జంపాల వెంకటేశ్వర్లు. మాకు అర ఎకరం పొలం ఉంది. ఏటా వానకాలం, యాసంగిలో రైతుబంధు డబ్బులు పడుతున్నయ్. మా ఆయన 2019 జనవరి 6న అనారోగ్యంతో చనిపోయిండు. అప్పుడు కేసీఆర్ సర్కారు తెచ్చిన రైతుబీమా కొండంత భరోసా ఇచ్చింది. వ్యవసాయ శాఖ అధికారులకు అన్ని వివరాలు ఇచ్చాను. 10 రోజుల్లోపు నా బ్యాంకు ఖాతాలో రూ.5 లక్షలు జమైనయ్. నాకు కూతురు మానిక, కుమారుడు ముఖేష్ ఉన్నారు. రైతుబీమా కింద వచ్చిన రూ.5లక్షల్లో రూ.4లక్షలు పెట్టి కూతురు పెళ్లి చేసిన. మిగిలిన లక్షతో నా కొడుకు ముఖేష్ మా ఊళ్లో వెంకటేశ్వర సెలూన్స్ పెట్టుకున్నాడు. ఆ తర్వాత కల్యాణలక్ష్మి ద్వారా కూడ రూ.లక్ష వచ్చాయి. ఇలా సీఎం కేసీఆర్ ఇచ్చిన రైతుబీమా డబ్బులతో మా కుటుంబానికి ఎంతో భరోసా దొరికింది. కష్టకాలంలో కేసీఆర్ సర్కారు ఆదుకోకుంటే మా కుటుంబం రోడ్డున పడేది. సీఎం మాలాంటి పేదల కోసం పెద్దమనసుతో పెట్టిన ఈ పథకాల వల్లే ఇంత మేలు జరిగింది. లేదంటే డబ్బుల కోసం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. సీఎం కేసీఆర్ మేలును జీవితంలో మరువం.

– జంపాల ఉమ– మునిగలవీడు, నెల్లికుదురు

గ్యాస్ కష్టాలు తీరుతయ్..

మంగపేట అక్టోబర్ 21 : నాలుగు పండలకే వంట గ్యాస్ ఇస్తామని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పడం సంతోషంగా ఉంది. విపరీతంగా పెరిగిన వంట గ్యాస్ ధర వల్ల మాలాంటి పేదోళ్లు చానా ఇబ్బంది పడుతున్నరు. ప్రతి నెల వెయ్యి రూపాయలు పెట్టి గ్యాస్ సిలిండరు కొనాలంటే చానా కష్టమైతాంది. అడవిలో ఇదివరకటి లెక్క కట్టెలు కూడా దొరుకుతలేవు. గ్యాసు రేటు పెరుగుళ్ల కొనుడు చానా ఇబ్బందైతాంది. మాలాంటి పేదల కష్టాలను అర్థం చేసుకొని రూ.400లకే గ్యాస్ సిలిండర్ ఇస్తే ఎంతో మేలైతది. మళ్ల కేసీఆర్ సర్కారే రావాలె.

– మాజి అంజన, కమలాపురం, మంగపేట, ములుగు జిల్లా

రైతు బీమా ఎంతో ఆసరైంది..

చెన్నారావుపేట, అక్టోబర్ 21 : కుటుంబ యజమాని చనిపోయిన తర్వాత కేసీఆర్ సర్కారు రైతుబీమా కింద ఇచ్చిన రూ.5 లక్షలు మా కుటుంబానికి ఎంతో ఆసరా అయినయ్. మా కొడుకును మంచిగ చదివించాలనుకున్నం. చాయ దుకాణం పెట్టి బతుకుతున్న సమయంలో మా ఆయన హఠాత్తుగా చనిపోయిండు. ఒక్కసారిగా అందరం ఆగమైనమ్. మాకు కొద్ది భూమి ఉండడం వల్ల రైతుబీమా డబ్బులు వచ్చినయ్. కేసీఆర్ గవర్నమెంట్ ఇచ్చిన రైతుబీమా నగదుతో మా కొడుకును ఇంజినీరింగ్ చదివించిన. పెద్ద చదువులు చదివించాలనే మా ఆయన కోరిక తీరింది. మా కొడుకు పోలీస్ ఉద్యోగం కోసం ఇన్ని రోజులు ఎదురు చూశాడు. ఉద్యోగం రాకపోవడంతో ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుంటున్నాడు. భవిష్యత్‌లో నా కొడుకు ఏదో ఒక ఉద్యోగం చేసి నన్ను పోషిస్తాడనే నమ్మకం ఉంది. ఇప్పుడు నేను చాయ దుకాణం నడుపుతూనా బతుకుతున్నాను. నా భర్త చనిపోయిన సమయంలో గవర్నమెంట్ రూ.5 లక్షలు ఇవ్వకపోతే చాలా కష్టమయ్యేది. రైతుబీమా పథకం పెట్టడం వల్లే మాకు మేలైంది.

– సూర రజిత, చెన్నారావుపేట మండలం, వరంగల్ జిల్లా

కొండంత ధీమా

పొద్దంతా కేవలం రెక్కల కష్టాన్ని నమ్ముకొని పనిచేస్తే తప్ప ఓ పేద కుటుంబానికి రోజు గడవదు. ఉన్నంతలో పిల్లల చదువు, ఇతర అవసరాలు, మూడు పూటలా కడుపు నిండా బువ్వ దొరికి నలుగురిలో నిలబడగలుగుతుంది. కానీ విధి వక్రీకరించి ఆ ఇంటి పెద్దకు అనుకోకుండా జరగరానిది ఏమైనా జరిగితే ఆ ఇల్లు ఆగమై రోడ్డున పడుతుంది. అప్పటదాకా ఎవరికీ తీసిపోకుండా ఓ మాదిరిగా బతికిన ఏ కుటుంబమైనా..ఇంటి పెద్దను కోల్పోతే ఏ ఆధారం లేక.. ఆడుకునేవాళ్లు లేక దిక్కుతోచని పరిస్థితి నెలకొంటుంది. ఆర్థికంగా కుటుంబాలు ఒడిదొడుకులకు లోనై వైకుంఠపాళీలో పాము మింగినట్టు పాతాళానికి పడిపోతుంది. ఇలాంటి కుటుంబాలకు ఆర్థిక అండను కల్పించి 'మేమున్నా'మంటూ ఓ ధైర్యాన్ని ఇచ్చేందుకు బీఆర్ఎస్ విప్లవాత్మకమైన ఎన్నికల మ్యానిఫెస్టోను తెచ్చింది గతంలో ప్రజలకు అవసరమైన పథకాలు..అడగని పథకాలను సైతం అమలు చేసిన తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్రంలోని పేదలందరికీ రైతు బీమా తరహా 'కేసీఆర్ బీమా..ప్రతి ఇంటికి దీమా' పేరిట అమలు చేసేందుకు మ్యానిఫెస్టోలో పొందుపరిచింది. తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న వ్యక్తి ఏ కారణంతో చనిపోయినా కుటుంబానికి రూ.5లక్షల బీమా వర్తింపజేసేందుకు సిద్ధమైంది.

పేదింటికి బీఆర్ఎస్ భరోసా

- గులాబీ మ్యానిఫెస్టో విప్లవాత్మకం
- కేసీఆర్ బీమా.. కొండంత ధీమా
- రైతు బీమా తరహా అమలుకు నిర్ణయం
- ఏ కారణంతో చనిపోయినా రూ.5లక్షలు
- తెల్లరేషన్ కార్డుదారులకు వర్తింపు
- రూ.400కే గ్యాస్ సిలిండర్
- సామాన్యులందరికీ తగ్గనున్న ఆర్థిక భారం
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై సర్వత్రా హర్షం

వరంగల్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/వరంగల్, (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా కేసీఆర్ బీమాపై పేద, మధ్య తరగతి ప్రజల్లో భరోసా కనిపిస్తున్నది. రూ.400కే గ్యాస్ సిలిండర్ వస్తే ఆర్థిక భారం తగ్గుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

అండగా రైతు బీమా

రైతు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రైతు బీమా' ఎంతో ఆర్థిక ధీమాను ఇస్తోంది. 18 నుంచి 59 ఏళ్ల రైతులు ఈ పథకానికి అర్హులు కాగా, రైతుల సంక్షేమం కోసం దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రభుత్వమే ఉచితంగా లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ)కు ప్రీమియం చెల్లిస్తోంది. ఈ పథకంలో చేరిన రైతులు ఏ కారణం చేత మృతిచెందినా ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తున్నది. అది కూడా వారం, పది రోజుల్లోనే ఎలాంటి వైరవీలు లేకుండా రైతు భాగస్వామి(నామినీ) లేదా కుటుంబీకుల బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తోంది.

గ్రూప్ ఇన్సూరెన్స్ పరిధిలోకి..

రైతుబీమా తరహాలోనే కేసీఆర్ బీమాను అమలు చేస్తామని ప్రకటించింది. తెల్ల రేషన్‌కార్డు ఉన్న కుటుంబంలో ఎందరు 18 ఏండ్ల నుంచి 59 ఏండ్ల మధ్య ఉంటారో వారందరూ బీమా పరిధిలోకి వస్తారని చెబుతున్నారు. మరికొన్ని పాలసీల్లో చిన్న పిల్లలను సైతం పరిధిలోకి తెచ్చే అవకాశాలున్నాయని, అయితే ప్రభుత్వం రైతు బీమాకు సంబంధించి పాటిస్తున్న పద్ధతిలో 18–59 మధ్య వయస్సు వారికే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

'గుబి'బండ కాదిక..

అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరిగినప్పుడు పెట్రో, గ్యాస్ ధరలు పెరగడం పరిపాటిగా మారింది. ఇక నుంచి అంతర్జాతీయ ధరలతో సంబంధం లేకుండా అర్హులైన నిరుపేదలు, అక్రెడిటేషన్ కలిగిన జర్నలిస్ట్ కుటుంబాలకు కేవలం రూ.400కే వంటగ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామని బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టడంపై ప్రజలు, జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వంటగ్యాస్ ధర రూ.974 ఉండగా దేశవ్యాప్తంగా ప్రతి కుటుంబం ఏడాదికి సగటున 9 సిలిండర్లు వినియోగిస్తుంది. ఇప్పుడు ఈ పథకం అమలైతే ఏడాదికి 12 సిలిండర్లు వినియోగించుకోవచ్చు. ఇప్పటికే ఉజ్వల పథకం కింద అర్హులైన కుటుంబాలకు ఏడాదికి 12 సిలిండర్లు రాయితీపై అందుతున్నాయి. ఇప్పుడు కొత్తగా మరో 12 సిలిండర్లు అదనంగా అందుతాయి. ఇలా ఏడాదికి 24 సిలిండర్లు అందుతాయి. ఇప్పటికే ఉజ్వల పథకం కింద ఉన్న లబ్ధిదారులు ఈ పథకానికి అర్హులు కాగా, కొత్తగా ఈ పథకానికి అర్హులు అవుతారు